సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 14 । మే । 2025



ధాన్యం కొనుగోలు చేయండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ధాన్యం కొనుగోలులో జాప్యంతో నష్టపోతున్నామని జిల్లెల్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల–సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.



ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: కరీంనగర్‌లో ఈనెల 22న నిర్వహించే హిందూ ఏక్తాయాత్ర పోస్టర్‌ను మంగళవారం బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. భారీగా తరలిరావాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
37.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కానీ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గృహహింస కేసుల్లో సత్వర న్యాయం దక్కాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రేవతి



సిరిసిల్ల: గృహహింస కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం దక్కాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రేవతి కోరారు. జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. గృహహింస కేసుల్లోని బాధితులతో మాట్లాడారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంతో కలిసి సమీక్షించారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి, వృద్ధులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. మహిళా సాధికారిత సిబ్బంది రోజా, రమ్య, సఖీ కేంద్రం సిబ్బంది మమత తదితరులుపాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు ఉండాలి

- జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత



సిరిసిల్ల: జిల్లాలో మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా ఆరోగ్య, వైద్యశాఖ సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో మంగళవారం ఆశ నోడల్ పర్సన్లతో సమావేశమయ్యారు. గర్భిణీల వివరాలు, వారికి అందించే పౌష్టికాహారం, వారి ఆరోగ్య పరిస్థితిని నమోదు చేయాలన్నారు. క్రమంతప్పకుండా పౌష్టికాహారం అందించాలని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక అధికారి సంపత్‌కుమార్, వైద్యులు రామకృష్ణ, అనిత, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌వో శాంత, బాలచంద్రం, సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

- 30 ఏళ్లు దాటినా వివాహం కాని యువత
- ఏళ్ల తరబడి ప్రయత్నాలు.. కుదరని సంబంధాలు
- ఉద్యోగం, సంపాదన ఉన్నా అమ్మాయి దొరకని పరిస్థితి
- వయసు దాటిపోతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- అమ్మాయి, అబ్బాయిల కుటుంబ సభ్యుల ఆలోచనల్లో మార్పే కారణం
- షరతులతో ముందుకు సాగని పేరంటం



లగ్గం.. షరతుల పగ్గం!

‘కరీంనగర్‌కు చెందిన రాజేశ్ (పేరుమార్చాం) ఎనిమిదేళ్ల క్రితం బీఎస్సీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.50 వేలకుపైగానే వేతనం. మూడేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటివరకూ కుదరలేదు’.

‘పెద్దపల్లి ప్రాంతానికి చెందిన నితిన్ (పేరుమార్చాం) హైదరాబాద్‌లోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.30 వేల వేతనం. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. మూడేళ్లుగా కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో యువకుడు గ్రామానికి రావడానికి కూడా సిగ్గుపడుతున్నాడు. ఏం చేయాలో తల్లిదండ్రులకు కూడా పాలుపోవడం లేదు’.

‘సిరిసిల్ల ప్రాంతానికి చెందిన యువకుడు బీటెక్ పూర్తిచేసి కరీంనగర్‌లో ఐటీ కంపెనీలో కొలువు సాధించాడు. ఇక్కడే పరిచయమైన ఓ యువతితో కలిసి నడవాలనే నిర్ణయానికి వచ్చాడు. ఒకే కులం కావడంతో కుటుంబ సభ్యులూ సరేనన్నారు. పెళ్లిపీటలు ఎక్కేముందే పెరిగిన పొట్టను తగ్గించుకోవాలని కాబోయే భార్య నిబంధన విధించింది. ప్రస్తుతం ఆ కుర్రాడు జిమ్‌లో కసరత్తులు చేస్తున్నాడు’.

‘జగిత్యాలకు చెందిన ఐటీ నిపుణుడు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకున్నాడు. అతని బయోడేటా నచ్చిన యువతి కుటుంబసభ్యులు హోటల్లో పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. ఇద్దరి ఉద్యోగాలు, వేతనాలు సరిపోవడంతో పెళ్లికి పచ్చజెండా ఊపారు. ఇక్కడే అనుకోని షాక్.. తన చదువుకైన ఖర్చును ఐదేళ్లపాటు తల్లిదండ్రులకు తన జీతంలోంచి ఇచ్చేందుకు అంగీకరించాలని అమ్మాయి షరతు పెట్టింది’.

ఒకప్పుడు వయసుకు వచ్చిన అమ్మాయి ఇంట్లో ఉంటే ఎంత వేగంగా పెళ్లి చేసి అత్తవారింటికి పంపిద్దామా? అని తల్లిదండ్రులు ఎదురుచూసేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అబ్బాయిలకు సంబంధాలు దొరకడం కష్టమైపోతోంది. ఒకప్పుడు అబ్బాయి గుణగణాలు, కుటుంబం గురించి తెలుసుకుని పిల్లనిచ్చేవారు. ఇప్పుడు అబ్బాయి ఏం చదువుకున్నాడు?, ఏ కంపెనీలో పనిచేస్తున్నాడు?, ఎంత సంపాదిస్తున్నాడు? అప్పులు, ఆస్తులు, రోగాలు.. సిబిల్‌స్కోర్ అంశాలను సైతం చూస్తున్నారు. దీంతో పెళ్లి ముచ్చట ముందుకు సాగడం కష్టంగా మారుతోంది.–హుజూరాబాద్

8లో▸



నీటి ఎద్దడి అధిగమించాం

- అన్ని వార్డులకు నిర్ణీత సమయంలో సరఫరా
- అవసరమైన ఏరియాల్లో ట్యాంకర్లతో అందిస్తున్నాం
- వేసవిలో ప్రజల' ఇబ్బందులు తీరుస్తున్నాం
- వచ్చే ఏడాదిలో విలీన గ్రామాల్లోనూ మిషన్ భగీరథ నీరు
- ఇంటర్వ్యూలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వాణి



సిరిసిల్లటౌన్: పక్కా ప్రణాళికతో సిరిసిల్లలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పోసు వాణి తెలిపారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు తగ్గట్టుగా నల్లాల ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరా, ఇబ్బందులపై 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

39 వార్డుల్లో నిత్యం నీటి సరఫరా

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డుల్లో నిత్యం తాగునీటి సరఫరా చేస్తున్నాం. వేసవి ఆరంభంలో కొన్ని ఏరియాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకున్నాం. ఆయా ఏరియాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాం. అన్ని వార్డులకు ప్రత్యేకంగా అధికారులు ఉన్నారు. 13 మంది లైన్‌మెన్లు, ఇద్దరు బోర్‌వెల్ మెకానిక్స్, 9 మంది లీకేజీ రిపేరర్స్ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఫిర్యాదులు పరిష్కరిస్తున్నాం

వేసవిలో నీటి కొరత రాకుండా ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశాం. 78935 93308లో ఇప్పటి వరకు ఎనిమిది ఫిర్యాదులు రాగా వెంటనే పరిష్కరించాం. ఫిర్యాదుల్లో ఎక్కువగా నల్లా కనెక్షన్లు కావాలని కోరారు. మిషన్ భగీరథ ద్వారా నిత్యం 9 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నాం. మున్సిపల్ ఫిల్టర్ బెడ్, ట్యాంకర్లు, పవర్ బోర్ల ద్వారా 8.6 ఎం.ఎల్.డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) నీటిని అందిస్తున్నాం.

39 వార్డులు.. 13 జోన్లు

సిరిసిల్ల, విలీన గ్రామాలు కలిపి 39 వార్డులను 13 జోన్లుగా విభజించి నీటి సరఫరా చేపడుతున్నాం. ఉదయం 3.30 నుంచి 6 గంటల వరకు ఎనిమిది జోన్లకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఐదు జోన్లకు నీటి సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం 1.10లక్షల మందికి నీటి సరఫరా ఉంది. రాబోయే ఏడాది తర్వాత 1.40లక్షల మందికి 24 ఎంఎల్‌డీ లీటర్ల నీటిని సరఫరా చేసే దిశగా పనులు చేపడుతున్నాం.

విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ

విలీన గ్రామాల్లో మిషన్‌భగీరథ పైపులైన్ ద్వారా చే పడుతున్నాం. మిషన్ భగీరథ పైపులైన్ లేని చోట్లలో 'అమృత్ 2.0' పథకంలో భాగంగా మరో 40 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం జరుగుతుంది. రూ. 100కోట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా తాగునీటి సరఫరాకు కొన్ని నిధులు కేటాయించగా పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాదిలోగా సిరిసిల్లలో విలీనమైన గ్రామాలతోపాటు అన్ని వార్డుల్లో నూరుశాతం తాగునీటి పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేపడతాం.

4 ట్యాంకర్లతో సరఫరా

సిరిసిల్ల పట్టణంలో మిషన్ భగీరథ, మున్సిపల్ ఫిల్టర్‌బెడ్ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. పట్టణ జనాభా 1.10లక్షల మందికి 17.6 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నాం. నీటి సరఫరా కాని ప్రాంతాలకు నాలుగు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేస్తున్నాం. అన్ని వార్డుల్లో మొత్తంగా 450 పవర్‌బోర్ల ద్వారా స్థానికులు నీటిని వినియోగిస్తున్నారు. వాటిలో 11 రిపేర్లు చేయిస్తున్నాం. మిగతా 439 పవర్‌బోర్లు ద్వారా ప్రజలు నిరంతరం నీటిని వినియోగించుకుంటున్నారు.

నీటిని వృథా చేయొద్దు

చాలా మంది నల్లాలకు బిరడాలు బిగించడం లేదు. ఫలితంగా నల్లా నీటిని వాడుకోని వారి ఇళ్లలో నుంచి నీరు వృథాగా పోతుందన్న ఫిర్యాదులు ఉన్నాయి. నల్లా నీరు వృథా పోకుండా పౌరులంతా బాధ్యతగా ఉండాలి. ఎవరికైనా నీటి సరఫరాలో సమస్య ఉంటే వెంటనే ఆఫీసులో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేస్తే సత్వరమే పరిష్కరిస్తాం. లీకేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేశాం.

సిరిసిల్ల మున్సిపల్ వివరాలు

జనాభా :	1,10,00
రోజూ నీటి సరఫరా :	16,500 మిలియన్ లీటర్లు
డిమాండ్ :	17.6 ఎంఎల్‌డీలు

క్లుప్తంగా

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వ్యవసాయరంగంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ధాన్యం డబ్బులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మహమ్మద్ ఖాజా, షకీల్ ఉన్నారు.

కూలి తగ్గించడం శోచనీయం



సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఆర్డర్ల చీరలు నేసే కార్మికుల కూలి తగ్గించడం శోచనీయమని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చీరల వస్త్రానికి యజమానులకు ఒక మీటరుకు రూ.32 నిర్ణయించగా, కార్మికుల కూలి ప్రకటించకపోవడంతో తక్కువగా ఇస్తున్నారన్నారు. బతుకమ్మ చీరలకు ఇచ్చిన మాదిరిగా మీటర్‌కు రూ.5.25 కూలి ఇవ్వాలని కోరారు. నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, గుండు రమేశ్, సబ్బని చంద్రకాంత్, ఒగ్గు గణేశ్, బెజిగం సురేష్, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్ల: జిల్లాలోని అర్హులైన మైనార్టీ విద్యార్థులు మైనార్టీ సంక్షేమ గురుకులాల్లో చేరాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. మైనార్టీ సంక్షేమ విద్యాసంస్థల్లో ప్రవేశాల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడల్లో మైనార్టీ గురుకుల సంక్షేమ విద్యాసంస్థలు ఉన్నాయని తెలిపారు. ఆయా విద్యాసంస్థల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఐదో తరగతిలో ప్రవేశానికి 60 సీట్లు (మైనార్టీ పిల్లలకు) ఉన్నాయని, 6 నుంచి 8వ తరగతి వరకు బ్యాక్ లాగ్ సీట్లు భర్తీ చేస్తారని వివరించారు. సిరిసిల్ల విద్యాసంస్థలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో కలిపి 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని కలెక్టర్ వివరించారు. వేములవాడలోని విద్యాసంస్థలో ఎంఎల్‌టీ(మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) 30 సీట్లు, డెయిరీ టెక్నాలజీ కోర్సులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వివరాలకు 79950 57908, 73311 70865లలో సంప్రదించాలని తెలిపారు. మైనార్టీ గురుకుల విద్యాసంస్థల జిల్లా ఇన్‌చార్జి భారతి, ఆయా విద్యాసంస్థల హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.

లగ్గం.. షరతుల పగ్గం!

హుజూరాబాద్: గతంలో 25, 26 ఏళ్లు వచ్చేసరికి అబ్బాయిల్లో దాదాపు 80 శాతం మందికి పెళ్లిళ్లు అయిపోయేవి. కొన్నాళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండుమూడేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. 30ఏళ్లు దాటినా పెళ్లికాని ప్రసాద్‌ల సంఖ్య పెరిగిపోతోంది. అబ్బాయికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఒక పెద్ద యజ్ఞమే చేయాల్సి వస్తోంది. గతంలో తల్లిదండ్రులు ఏదైనా సంబంధం చూస్తే అమ్మాయిలు మాట్లాడకుండా చేసుకునేవాళ్లు. కానీ, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. అమ్మాయిల ఇష్టాయిష్టాలను కాదనలేని పరిస్థితి. అమ్మాయి ఓకే అంటే తప్ప పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో అమ్మాయిలు పూర్తి స్వేచ్ఛగా ఉంటున్నారు. మంచి వేతనం, సొంత ఇల్లు.. వంటివి ఉన్నవారి వైపు మొగ్గు చూపుతున్నారు. అలాంటి సంబంధాలను వెతకమని కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. విదేశీ సంబంధాలు అయితే ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. వెంటనే ఓకే చెప్పేస్తున్నారు.



పట్టింపులతో సమస్య..

అబ్బాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి కూడా కొంతవరకూ ఈ సమస్యకు కారణమని చెప్పవచ్చు. మంచి కట్నకానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. తర్వాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు.

భిన్నమైన పరిస్థితి

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాలు చేసే అబ్బాయిలను కోరుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉన్న అబ్బాయితో పెళ్లి చేస్తే అమ్మాయికి జీవితాంతం ఇబ్బంది ఉండదన్న భావన తల్లిదండ్రుల్లో ఉంటోంది. అదే పట్టణ ప్రాంతాల్లోని అమ్మాయిలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా సాఫ్ట్‌వేర్ సంబంధాలపై మొగ్గుచూపిస్తున్నారు. విదేశాల్లో ఉన్నారంటే కట్నం ఎంతయినా ఇచ్చేందుకు వెనుకాడడం లేదు. దీంతో చిరుద్యోగాలు చేసుకునే అబ్బాయిలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునేవారికి 35 ఏళ్లు దాటినా సంబంధాలు దొరకడం లేదు.

మానసిక సమస్యలు

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగిపోతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు.

ఒకరికొకరు అర్థం చేసుకోవాలి



తమ కూతురుకు పెళ్లి చేస్తే పరిస్థితి ఎలా ఉండాలో అమ్మాయి తల్లిదండ్రులు ముందే ఒక ఆలోచనకు వస్తున్నారు. పెళ్లి అనేది ఇద్దరి జీవితాలను నిర్ణయించేది. అమ్మాయికి అర్థం చేసుకునే గుణం, అబ్బాయికి ఓపిక అనేది ఉన్నాయో లేవో గమనించి వివాహం చేస్తే ఆ బంధం నిలబడుతుంది. తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచన చేస్తే బాగుంటుంది.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హుజూరాబాద్

ఆలోచనల్లో మార్పు రావాలి



అమ్మాయిల తల్లిదండ్రుల ధోరణి ప్రస్తుతం పూర్తిగా మారింది. గత 20 ఏళ్లలో అమ్మాయిల ఆలోచన సైతం మారింది. పెళ్లి చేసుకునే అబ్బాయి ఉద్యోగం, ఆస్తిపాస్తులు, ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే అడుగులు ముందుకు పడుతున్నాయి. అర్థం చేసుకునే గుణం, కష్టపడేతత్వం, తెలివితేటలతో ఎదిగే యువకుడికి అమ్మాయినిచ్చి పెళ్లి చేస్తే సుఖపడుతుంది.

– ఆడెపు రవీందర్, మ్యారేజ్ బ్యూరో, హుజూరాబాద్

మానసిక ఒత్తిడిలో తల్లిదండ్రులు



అబ్బాయికి 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడాన్ని తల్లిదండ్రులు సమాజంలో నామోషీగా భావిస్తున్నారు. అబ్బాయిల్లో నిరుత్సాహం, పెళ్లి పట్ల విరక్తి భావం పెరుగుతోంది. కొందరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా పెరుగుతున్నాయి. ఇలాంటి వారికి కౌన్సెలింగ్ ఇప్పించడం చాలా అవసరం. పెళ్లి అన్న దాన్ని పరువుగా భావించడం వల్లే అబ్బాయిలు, వారి తల్లిదండ్రుల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి.

– డాక్టర్ ఎల్.వర్షి, మానసిక నిపుణుడు, హుజూరాబాద్

సజావుగా పాలీసెట్ ప్రవేశ పరీక్ష

సిరిసిల్ల ఎడ్యుకేషన్/తంగళ్లపల్లి: జిల్లాలో పాలీసెట్ ప్రవేశ పరీక్ష సజావుగా సాగింది. తంగళ్లపల్లి, గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనితీరును తెలుసుకున్నారు. తంగళ్లపల్లి హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ శంకర్ నారాయణను ఆదేశించారు. బోరుమోటార్ కోసం ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో 2,136 మందికి 2,027 మంది హాజరయ్యారు.



తంగళ్లపల్లి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఈ టెక్నికల్ అసిస్టెంట్ మాకొద్దు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తాము నిబంధనల ప్రకారం పని చేసినా తగిన వేతనం రావడం లేదని ఉపాధిహామీ కూలీలు మంగళవారం నిరసనకు దిగారు. టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ తమకు వద్దంటూ ఇంటి దారి పట్టారు. కూలీలు తెలిపిన వివరాలు. మండలంలోని కోరుట్లపేటలోని అప్ప సముద్రంలో మంగళవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న 100 మంది కూలీలు తమకు సరైన వేతనం రావడం లేదని పని స్థలంలోనే నిరసన తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ మహిళా కూలీలపై దుర్భాషలాడుతున్నాడన్నారు. అతన్ని ఇక్కడి నుంచి పంపించాలని డిమాండ్ చేశారు. పని చేయని వారి అకౌంట్లో డబ్బులు పడుతున్నాయన్నారు. అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీవో కొమురయ్యను వివరణ కోరగా.. కూలీ డబ్బుల అవకతవకలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.



ఉపాధి పనులను బహిష్కరించి ఇంటిదారి పట్టిన కూలీలు

అంతర్‌జిల్లా దొంగల ముఠా నాయకుడి అరెస్టు

ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది దాసరి మురళీకృష్ణ, దాసరి నర్సయ్య, గణేష్, రాజేష్, రావుల శివ, సమ్మక్క, భవాని, రేణుక, నాగయ్యలు దొంగల ముఠాగా ఏర్పడ్డారు. కొన్ని నెలలుగా చోరీలకు పాల్పడుతున్నారు. గత నెలలో ముఠాలోని ఇద్దరు రాజేష్, రావుల శివలను పోలీసులు పట్టుకొని, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన సభ్యుల కోసం డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలు గాలించగా మంగళవారం ఇందల్వాయి ఎస్సై సందీప్, సిబ్బంది కలిసి ముఠాలోని ముఖ్య నాయకుడు దాసరి మురళీకృష్ణను పట్టుకున్నారు. నిందితుల నుంచి 7 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. మొబైల్‌ఫోన్, రూ.1500 నగదు, రెండు రోల్డ్‌గోల్డ్ నెక్లెస్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మురళీ ఇదివరకే నేర చరిత్ర కలిగి, పలుమార్లు జైలుకు వెళ్లాడు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగుండారం గ్రామానికి చెందిన కనకట్ల కమలాకర్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన చిన్నవేణి శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు ప్రొబేషనరీ ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. కమలాకర్, శ్రీశైలం ఈనెల 11వ తేదీ రాత్రి ఫోన్‌లో దుర్భాషలాడుకున్నారు. కోపోద్రిక్తుడైన శ్రీశైలం అదే సమయంలో కమలాకర్ ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

భూకబ్జాకు యత్నించిన వ్యక్తులపై కేసు

చందుర్తి(వేములవాడ): భూకబ్జాకు యత్నించిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై బి.అంజయ్య తెలిపారు. ఎస్సై అంజయ్య తెలిపిన వివరాలు. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన రైతు అందాసు మాధురికి సంబంధించిన 6.15 ఎకరాలను గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన మ్యాదరి శంకర్, మ్యాదరి నర్సయ్య ఉరఫ్ నామాల నర్సయ్య, మ్యాదరి నర్సయ్య, మ్యాదరి పోచయ్య, యాస శంకర్, మ్యాదరి రేణ, మ్యాదరి యేసయ్య, మ్యాదరి శాంత, మ్యాదరి లావణ్యలు భూమిని కబ్జా చేసి సాగు చేయాలనే ఉద్దేశంతో ట్రాక్టర్‌తో భూమిలోకి ప్రవేశించారు. ఎకరం భూమిని దున్నించారు. అడ్డు వెళ్లిన అందాసు మాధురిని మ్యాదరి నర్సయ్య ట్రాక్టర్‌తో గుద్ది చంపి, ఇక్కడే పాతి పెడతానని బెదిరించాడు. ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరింపులకు పాల్పడ్డారు. వీరందరితో తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడ్డ విద్యుత్ స్తంభం
- కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు
- తడిసిన ధాన్యం

ఇల్లంతకుంట(మానకొండూర్): జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడగా.. విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. మామిడితోటల్లోని కాయలు నేలరాలిపోయాయి. ఇల్లంతకుంట మండలం చిక్కుడువానిపల్లి, రామాజీపేట, వెల్జీపురం, ఓబులాపురం గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చిక్కుడువానిపల్లిలో చింతమడక శంకరయ్య ఇంటిపైన రేకులు లేచిపోయాయి. రేకులపై బరువుగా పెట్టిన రాయి శంకరయ్య భార్య శ్యామలపై పడడంతో గాయపడింది. అదే గ్రామంలో కంకటి బాలయ్య వ్యవసాయబావి వద్ద కరెంటు స్తంభం నేలకొరిగింది. వెల్జీపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో నీరు నిలిచింది.

తంగళ్లపల్లి/కోనరావుపేట/వేములవాడ: తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్లలో అకాల వర్షానికి ఆకారపు రాజయ్యకు రేకుల ఇల్లు కూలింది. కోనరావుపేట మండలం మరిమడ్లలో పిడుగుపడి అక్కెనపల్లి రమేశ్‌కు చెందిన రూ.80వేల విలువైన ఆవు చనిపోయింది. అహ్మద్ హుస్సేన్‌పల్లిలో అక్కెనపల్లి శంకరయ్య ఇంటిగోడ కూలింది. సమీపంలోని సింగిల్‌విండో గోదాము రేకులు లేచి, అక్కడే పడ్డాయి. గ్రామానికి చెందిన కొప్పెర లింగారెడ్డి ఇంటి వద్ద చెట్టుపై పిడుగుపడింది. వేములవాడ పట్టణంలో భారీ వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన వర్షానికి రోడ్డుపై వరదనీరు నిలిచింది.



వెల్జీపురం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

ప్రాణం తీసిన పంచాయితీ

- బూతులు తిట్టాడని ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కులపెద్దలు చేసిన పంచాయితీ ఒకరి నిండు ప్రాణాన్ని తీసింది. పంచాయితీలో బూతులు తిట్టడంతో అవమాన భారంగా భావించిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన కడమంచి స్వామి(34) ఇంట్లో లేనప్పుడు అ తని భార్యపై అదే గ్రామానికి చెందిన టేకు ప్రేమ్‌కుమార్ లైంగికదాడికి యత్నించాడు. స్వామికి ఈ వి షయం తెలియడంతో ప్రేమ్‌కుమార్‌ను నిలదీశా డు. మూడు రోజుల క్రితం కులపెద్దలు పంచాయితీ పెట్టి ప్రేమ్‌కుమార్‌కు జరిమానా విధించారు. దీంతో కోపోద్రిక్తుడైన ప్రేమ్‌కుమార్ స్వామిని అందరిముందే బూతులు తిట్టాడు. అంతే కాకుండా చావమని తిట్టడంతో అవమానంగా భావించిన స్వామి మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మృతుని భార్య ఫిర్యాదుతో ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రెయినీ ఎస్సై కె.వినీతారెడ్డి తెలిపారు. అయితే గ్రామానికి చెందిన కొందరు పెద్దమనుషులతోపాటు కొందరు విలేకరులు కలిసి ఈ పంచాయితీ నిర్వహించినట్లు తెలిసింది. వీరిద్దరి నుంచి రూ.4లక్షల చొప్పున మొత్తం రూ.8లక్షలు పంచాయితీ దరావతుగా తీసుకోవడంతోపాటు ఆ మొత్తం కూడా ఖర్చు అయినట్లు తెలిపారనే చర్చ సాగుతోంది.

స్థానికంగా ఇసుకకు అనుమతించాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాములు

సిరిసిల్లటౌన్: స్థానికంగా భవన నిర్మాణాలకు ఇసుక, మొరం తరలించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సిమెంటు, సలాక రేట్లు పెరగడంతో పనులు దొరకడం లేదన్నారు. ఇసుక, మొరానికి ప్రతీ రోజు పర్మిషన్ ఇవ్వాలన్నారు. ఇసుక లేక భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. మీసం లక్ష్మణ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కేవీలో వందశాతం ఉత్తీర్ణత

- పది, పన్నెండో తరగతి విద్యార్థుల సత్తా



ఓం సాహూ



పెంద్యాల ఆగస్త్యశర్మ



ప్రద్యుమ్నరావు



హ్రిశికేశ్

జ్యోతినగర్(రామగుండం): సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్(సీబీఎస్‌ఈ)లో ఎన్టీపీసీ రామగుండం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు విజయదుందుబి మోగించారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో పదో తరగతి, 12వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచారు. పదో తరగతిలో 67 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 67 మంది ఉత్తీర్ణత సాధించారు. ఓం సాహూ(484/500), 12వ తరగతిలో 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సైన్స్ విభాగంలో పెంద్యాల ఆగస్త్యశర్మ (398/500), కుడితేటి ప్రద్యుమ్నరావు (396/500), కామర్స్ విభాగంలో హ్రిశికేశ్ (441/500) మార్కులు సాధించారు. దీంతో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత, నామిని చైర్మన్ బిజయ్ కుమార్ సిగ్దర్, ప్రిన్సిపాల్ ఓరుగంటి శోభన్‌బాబు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చొప్పదండి నవోదయ ప్రభంజనం

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయం 2024–25 పదోతరగతి, పన్నెండో తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. పన్నెండో తరగతిలో 500మార్కులకు 483మార్కులు సాధించి పి.రుత్విక్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించారు. పదోతరగతిలో వి.వశిష్ట యాదవ్ 500 మార్కులకు 480 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మంగతాయారు అభినందించారు.

'సీబీఎస్‌ఈ' ఫలితాల్లో అల్ఫోర్స్ ప్రభంజనం



ఇంటర్ విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): సీబీఎస్‌ఈ పదోతరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ సీబీఎస్‌ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రభంజనం సృష్టించినట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. పదో తరగతిలో 500మార్కులకు గాను మహమ్మద్ షాజీనీన్ తబాసుమ్ జాతీయస్థాయిలో 99.4శాతంతో 497మార్కులతో జిల్లాస్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. ఎం.సుచీత్‌రెడ్డి 493 మార్కులు, జె.సుప్రభ 492, ఆర్.వేదిక, టి.హర్షిణి 491, డి.హర్షిత్489, బి.ఆకృతి, సీహెచ్.అనీశ్‌కుమార్, రయానుద్దీన్ 488, ఏ.నక్షత్ర, పి.శ్రీవర్షిత, కె.నక్షత్రరెడ్డి 486మార్కులు సాధించారని పేర్కొన్నారు. 12వ తరగతిలో 500 మార్కులకు గాను వి.సంజీతరెడ్డి 482మార్కులు, ఎస్.అనిరుద్ సాయి 482, వి.శశాంక్‌రెడ్డి 478, జె.వమీకా 473 మార్కులు సాధించారని తెలిపారు. 10వ తరగతిలో అత్యధికసంఖ్యలో విద్యార్థులు 90శాతం మార్కులు సాధించారని, 12వ తరగతిలో 13మంది 90శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



పదోతరగతి విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

పారమిత విద్యార్థుల ప్రతిభ



శ్రీరామ చంద్ర



రూపనిగమ



మనోజ్ఞ



స్ఫూర్తి

సప్తగిరికాలనీ(కరీంనగర్): సీబీఎస్‌ఈ పదోతరగతి ఫలితాల్లో పారమిత హెరిటేజ్, వరల్డ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీకర్, పి.గోపికృష్ణ తెలిపారు. 500మార్కులకు గాను ఆకుల శ్రీరామచంద్ర 488 మార్కులు, రూపనిగమ, మనోజ్ఞలు 487, స్ఫూర్తి 481, బి.వర్షిణి 480మార్కులు సాధించినట్లు తెలిపా రు. పాఠశాలకు చెందిన 62మంది 90శాతం పైన మార్కులు సాధించగా 80 నుంచి 100శా తం సాధించిన విద్యార్థులు 160మంది ఉన్నారని అన్నారు. విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత ఈ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, వినోద్‌రావు, వీయూఎం.ప్రసాద్, టీఎస్వీ.రమణ, హన్మంతరావు, రవీంద్ర పాత్రో, నాగరాజు అభినందించారు.

మానేరు విజయకేతనం



ఆత్రేయ



మస్రా మహావీన్



అరవింద్‌రెడ్డి



శరత్ చంద్ర

సప్తగిరికాలనీ(కరీంనగర్): సీబీఎస్‌ఈ పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 98మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 100శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు తెలిపారు. పలువురు విద్యార్థులు తెలుగులో 100 మార్కులు, ఇంగ్లిష్‌లో 98మార్కులు, హిందీలో 97మార్కులు, సైన్స్, సోషల్‌లో 96మార్కులు, గణితంలో 95 మార్కులు సాధించారని అన్నారు. 500 మార్కులకు పాఠశాలకు చెందిన ఏ.ఆత్రేయ 471మార్కులు, మస్రా మహావీన్ 461, ఏ.అరవింద్‌రెడ్డి 458, ఏ.శరత్ చంద్ర 456మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కడారి సునీతరెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతారెడ్డి అభినందించారు.



రథోత్సవం.. రమణీయం

గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్తపల్లిలో శ్రీరుక్మిణీసత్యబామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తజనంతో పుర వీధులు కిటకిటలాడాయి. డప్పు వాయిద్యాలు, స్వామి నామస్మరణతో వీధులు మారుమోగాయి.



నెత్తిన బోనాలతో బద్దిపోచమ్మ ఆలయం వద్ద బారులు తీరిన మహిళలు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్నకు కోడె.. పోచమ్మకు బోనం

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని మంగళవారం దాదాపు 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు అక్కడి నుంచి బద్దిపోచమ్మ దర్శనానికి తరలివెళ్లారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కు చెల్లించుకుని స్వగ్రామాలకు తిరుగుప్రయాణమయ్యారు. రాజన్న హుండీలను బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.